నాకు పౌరుషం వచ్చింది. విసురుగా వెళ్ళి ఎదురుగా నిలబడి 'వెర్రబ్బాయ్ అంటున్నావ్... నాకు వెర్రి ఉందని ఎవరు చెప్పారు...?' అనడిగా.

అదే నవ్వు మొహంతో 'సరిగ్గా వినిపించలేదు కామోసు! నేనన్నది 'ఎర్రబ్బాయ్' అని!' అంది.

'ఎర్రబ్బాయ్ అని మాత్రం పిలవటం దేనికీ...? నాకు పేరు లేదా...?' రోషంగా అన్నాను.

'కర్రి పిల్లనని, కాదని వెళ్ళిపోయిన వాళ్ళ పేరు నాకెందుకని తెలుసుకోలేదు. మావాళ్ళు చెప్పారేమోగానీ... నేను గుర్తు పెట్టుకోలేదు... అవసరం ఏముందనీ...!' అంది చిలిపి నవ్వుతో.

నేను కొంచెం ధైర్యం తెచ్చుకుని మాట కలిపాను. 'నీ పేరు... నువ్వు చెప్పాక, నా పేరు నేనూ చెబుదామనుకున్నా. నువ్వు పడనివ్వకుండా పకపకలాడేసరికి నాకు మాటలు రాలేదు. అది సరేగానీ.... నిన్ను కర్రిపిల్లని అన్నదెవరూ...? అలా అని మేం కాదన్నామా... వింతగా ఉందే...!' అన్నా.

'కాదా... మా వాళ్ళే అన్నార్లెండి.... మీ దగ్గర్నుండి ఏ కబురూ రాకపోయేసరికి, పిల్లాడు ఎర్రగా ఉన్నాడుగా... మన కర్రిపిల్ల నచ్చిఉండదనే అభిప్రాయానికి వచ్చేశారు! కర్రిపిల్ల అని మావాళ్ళు ముద్దుగా అంటూ వుంటారు.... అప్పుడప్పుడూ మాత్రమే లెండి.'

ఆ మాటలకి నాకూ హుషారొచ్చేసింది.... అంటూ మా నాన్న ఒక క్షణం ఆగేసరికి నేను ఆత్రుత పట్టలేక 'అమ్మాయి అనే చెబుతున్నావు... ఇంతకీ ఆ అమ్మాయేనా మా అమ్మ... ముందు అది చెప్పు...' అనడిగా.

మా నాన్న చిన్నగా నవ్వి 'అంత తొందరెందుకురా... నిదానంగా చెప్పుకుందాం...!' అన్నాడు. అప్పటి జ్ఞాపకాలతో కాబోలు నాన్న మొహంలో అదో విధమైన మెరుపు...! అంటే ఆ ముచ్చట్లన్నీ నెమరేసుకోవటం నాన్నకీ సంబరంగానే ఉందన్నమాట!

'సరే నాన్నా... నీ ఇష్టం వచ్చినంత నిదానంగా చెప్పు. నేను సరదాగానే వింటా...!' అన్నా నవ్వు మొహంతో.

నాన్న మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు.

"అప్పుడు నేనూ చెప్పాను. నాకు చదువులేదని, ఆపైన తనంత చురుగ్గా లేననీ తనే నన్ను కాదన్నది కాబోలని మేమూహించిన సంగతి".

ఇలాంటి అపార్థాల వల్ల మాత్రమే పెళ్ళి నిశ్చయమవలేదుగానీ మా ఇద్దరికీ, ఇరు

కుటుంబాలకీ కూడా ఇష్టమేనని అర్థమై సరదాగా నవ్వుకున్నాం...! మనసు తేలికపడిరది!

తర్వాత తను చెప్పింది. "చూసీ చూడగానే మీరంటే ఇష్టం ఏర్పడిరది. మీ గురించీ, మీ కుటుంబం గురించీ విన్నాను. అంత మంచి పేరున్న ఇంటికి కోడలుగా వెళ్ళటం అదృష్టమని అనుకున్నానే గానీ చదువు గురించి అస్సలు ఆలోచించలేదు. నాకు ఇష్టమేనని మా వాళ్ళూ గ్రహించారుగానీ, మధ్యవర్తి వచ్చి ఏ కబురూ చెప్పకపోవటంతో మా సంబంధం నచ్చలేదు కాబోలని వూరుకున్నారు...'

ఒక క్షణం ఆగి మళ్ళీ అంది. 'మీరీ ఊళ్ళోకి వస్తోంటే చూసి నేను ఏమనుకున్నానో తెలుసా... ఈ ఊళ్ళో ఎవరైనా ఎర్రపిల్లని చూడటానికి వస్తున్నారేమోనని! పెళ్ళి చూపులకి తోడు ఎవరూ లేకుండా వస్తున్నారేంటని అడుగుదామనే మిమ్మల్ని ఎర్రబ్బాయ్... అని పిలిచాను! నాకు... మీరు నచ్చలేదేమోనని మీరంతా ఊహించుకుంటే... నాకిప్పుడు నవ్వు కూడా వస్తోంది! ఎందుకంటే... ఈ పెళ్ళి జరిగేట్టు చూడు స్వామీ... అని నేనేమో దండం కూడా పెట్టుకున్నాను మరి...!'

తలొంచుకునే సిగ్గుతో పకపకమంది! నాకైతే పూలవర్షం కురిసినట్లనిపించి... మనసు ఝల్లుమంది!

'చాలా ఆశ్చర్యంగా ఉంది!... మా అమ్మ 'చలాకైన పిల్ల కోడలుగా వస్తే అంతకన్నా కావలిసిందేముందీ' అనంటే... నేను చాలా సంబర పడ్డాను...! 'మనవాళ్ళు చెప్పిన మాటల్ని బట్టి... ఈ సంబంధం కుదరదనే అనిపిస్తోంది...! ఏమోలే... ఎక్కడ రాసిపెట్టి ఉందో...' మళ్ళీ అంటూ అమ్మ నిట్టూరుస్తే... చూడకుండానే అంతలా మా అమ్మ మెచ్చిన, నాకు బాగా నచ్చిన అమ్మాయితో సంబంధం కుదిరితే బావుండని... అలా దీవించమని నేనూ దేముడికి దండం పెట్టుకున్నాను... ఇప్పుడు నువ్వు అలాగే అనుకున్నావని చెప్పేసరికి ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉంది...!' అన్నాను.

ఏకాంతం కాబట్టి నాకూ ధైర్యం వచ్చేసిందేమో ఏకబిగిన మాట్లాడేశాను. 'సరే... అసలు విషయం తెలిసిందిగా... ఇక ఇంట్లోవాళ్ళకీ చెబుదాం...' అంటూనే వెను దిరుగుతూంటే 'ఒకమాట...' అంటూ నిలబెట్టింది.

ఏం లేదు... అమ్మాయిలకైతే చాకలిపద్దు రాసుకోవటానికి చేతనైనంత అయిదో తరగతి చదువు చాల్లే అనే పద్దతి ఉందిగా... మరి... మరి... మీకైనా పాలఖాతాల పద్దు రాసుకునేంత అయినా చదువు లేకపోతే ఎలా... షరతు అనుకుని కోపం తెచ్చుకోకపోతే ఒక మాట... నాకు వచ్చిన ఆ నాలుగు అక్షరాలూ మీకూ నేర్పగలిగితే... నాకూ మర్చిపోనట్లు ఉంటుందనీ...' అంటూ మాటలు ఆపేసింది.

అంటే... తనే నాకు చదువు చెబుతానంటోందని అర్థమైంది! 'ఈ వయసులో బడికి వెళ్ళి చదువు మొదలు పెట్టమంటే కష్టంగానీ... నీ దగ్గిర చదువుకోవటానికేం... నాకూ

ఇష్టమే...' అంటూ సరదాగా నవ్వి ఇంకోమాట కూడా ఇచ్చేశాను. ఇప్పుడే కాదు... మన పెళ్ళయ్యాక కూడా ఎపుడూ నీమాటని, ఇష్టాన్ని కాదనను! ఎందుకంటే... నువ్వు తెలివిగా ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకోగలవని నమ్మకం కుదిరింది...!'

నా మాటలకి ఆ అమ్మాయి నావైపు ఆనందంగా చూసింది.

నేనూ వెళ్ళొస్తానన్నట్లుగా తలవూపి, అడుగులు వేస్తోంటే... చన్నీళ్ళు మీద పడినట్లయి... వెనుదిరిగి చూశాను.

ఆ అమ్మాయి నవ్వు మొహంతో కొంచెం సిగ్గుగా చూస్తూ 'ఏమని... ఎలా... పిలవాలో తెలియకా...' అంటూ ఆగిపోయే సరికి నేను చిరునవ్వుతో 'నీళ్ళతో పిలిచావంతేగా.. సరే... ఏమిటో చెప్పు...' అన్నాను.

'అదే... ఊళ్ళోకి... ఏదో పనిమీద వచ్చారేమోగా, మళ్ళీ మీ వూరివైపే వెళ్ళిపోతున్నారేం అని అడగాలనీ...' అంటూ నసిగింది.

'మా ఫ్రెండొకడు... ఈ ఊళ్ళో ఏదో పని ఉందని చెబితే, నేనే అది చేసుకు వస్తానని, ఈ ఊరుకు వెళ్ళాల్సిన పని నాకూ ఉందనీ చెప్పాను... అంటే... నిన్ను మళ్ళీ మరోసారి చూసే అవకాశం దక్కుతుందేమోననే చిన్న ఆశ మనసులో ఉండటం వలనే అలా అన్నాననుకుంటా. నిజంగానే నా ఆశ నెరవేరి కనపించావు! అంతేకాదు... మనసు విప్పి చెప్పుకోవటంతో అపార్థాలు కూడా పోయాయి...ఈ కబురు వెంటనే మా వాళ్ళకు చేరవేయటమే నాకిప్పుడు ముఖ్యంగా అనిపిస్తోంది...అందుకే వెళ్ళిపోతున్నాను..మా ఫ్రెండు పనిదేముందిలే... నాకు వీలుకాలేదు, నువ్వే చూసుకోరా అని చెప్తేస్తా...!'

గడగడా నేను మాట్లాడేస్తుంటే... ఆ అమ్మాయి బుగ్గన వేలేసుకుని ఆశ్చర్యంగా చూసి, ముసిముసి నవ్వులు రువ్వింది...!

నేనూ సరదాగా మళ్ళీ చెప్పాను... ' ఆరోజు నీ పేరు చెప్పలేదు... నవ్వేసావంతే... ఇప్పుడు అయినా చెబుతావా...' నాపేరు నీకు తెలిసినా తెలియకపోయినా నేనే చెబుతా" రాఘవ...!' అన్నాను.

'నా పేరు లక్ష్మి...' అంటూ నవ్వి... నడుం మీద పెట్టుకున్న నీళ్ళ బిందెతో వెనుదిరిగి చకచకా వెళ్ళిపోయింది....' కథ చెప్పటం అయిపోయిందన్నట్లుగా నాన్న మాటలు ఆపేసరికి

'ఆ తరువాత...?' అని సరదాగా అడిగాను.

'ఏముందిరా... మధ్యవర్తికి కబురు వెళ్ళటం... అటువైపు వాళ్ళూ, ఇటువైపు వాళ్ళూ కూర్చుని మాట్లాడుకుని ముహూర్తాలు పెట్టుకున్నారు... పెళ్ళి జరిపించేశారు...! అంతే... ఆ తర్వాత నువ్వు మా మధ్యకు వచ్చేసి... ఇలాంటి గడుగ్గాయి ప్రశ్నలు వేసేంతగా ఎదుగుతున్నావ్...!' అంటూ నాన్న నవ్వాడు.

'అంతా బాగా చెప్పావుగానీ నాన్నా ఒక విషయం మరిచిపోయావు... ఆ అమ్మాయి...



లక్ష్మి... అదే... మా అమ్మే అనుకో... మీ అందర్నీ చూడగానే, భోజనానికి వచ్చారని ఎందుకు భావించి అలా మాట్లాడిందో, మీకు తర్వాత తెలిసిందిగా... ఆ ఊళ్ళో ఉన్న ఓ షాపులో మేలురకం విత్తనాలూ, ఎరువులూ తక్కువ ధరకే దొరుకుతాయనే పేరు ఉండటంతో చుట్టుపక్కల ఊళ్ళనుండీ అపుడపుడూ కొందరు రైతులు వస్తూంటారటగా, అలాంటి రైతులు మధ్యాహ్నం పూట తమ వూరికి తిరిగి వెళ్తూంటే చూసి కామయ్య తాత 'ఏ సమయానికి ఇంటికి చేరతారో... ఇపుడు మా ఇంటికి వచ్చి మాతో పాటు భోజనం చేసి వెళ్ళండీ...' అని పిలిచి వారానికి రెండు మూడు సార్లయినా అలాంటి పొరుగూరు రైతులకి భోజనం పెట్టి పంపించే అలవాటు ఉండటంతో, అమ్మ... అలా భోజనానికి వచ్చిన వాళ్ళే అనుకుని
అలా మాట్లాడిందట కదూ...!' అని నేను చెబుతూంటే, నాన్న ఆశ్చర్యంతో 'నీకెలా తెలిసిందీ...?' అనడిగాడు.

'ఇంత విపులంగా కాదుగానీ, క్లుప్తంగా నాన్నమ్మ చెప్పిందిలే...! అప్పట్లో... మన వూరివాళ్ళు... పెళ్ళిచూపుల్లో అమ్మ చూపించిన తెగువనీ, తీరుతెన్నుల్నీ విడ్డూరంగా చెప్పుకున్నారటగా...' అనగానే నాన్న పెద్దగా నవ్వాడు.

'భడవా... మరెందుకురా నన్ను వాగించావూ... ఏం తెలియనట్లు మళ్ళీ విన్నావా...?' అన్నాడు.

'నాన్నమ్మ క్లుప్తంగా చెప్పింది. నువ్వేమో సరదాగా చెబుతూంటే... నాకు వినటం చాలా బావున్నట్లుంది...! అయినా నేనడిగిందేమిటీ... అమ్మ నీకు టీచరెలా అయిందనీ... అని. అంతేగా... సరే, నువ్వా కథంతా చెబుతూంటే... నాకేం...ఇష్టంగా విన్నానూ...' అంటూ నవ్వాను.

గుమ్మం దగ్గిర చిరునవ్వుతో వింటూ నిలబడిన అమ్మ వైపు చూస్తూ నాన్న 'వీడిని... నువ్వు చిన్నపిల్లాడని అంటున్నావు... విను... వీడి కబుర్లు... తెలుస్తోందా... ఎంత ఆరిందా అయ్యాడో...!' అనగానే మళ్ళీ అమ్మ చిరునవ్వులు చిందిస్తూ లోపలకి వెళ్ళిపోయింది.

నాన్న నాతో 'చూడరా... అప్పుడు.... నన్నంత అల్లరిపెట్టిన మీ అమ్మ... ఇపుడేమో చిరునవ్వుతో అందరి మాటలు వింటూ.. అప్పుడప్పుడూ మాత్రం మాట్లాడటం చేస్తోంది...' అన్నాడు ఫిర్యాదు చేస్తున్నట్లుగా.

'ఎక్కువగా వినటం... తక్కువ మాట్లాడటం... తెలివైన లక్షణమని అంటారుగా అందుకని అది పాటిస్తోందేమో... అయినా నీకే ఎక్కువ మాట్లాడటానికి అవకాశం ఇస్తోందని సంతోషించవచ్చుకదా...' అంటూ నవ్వాను.

మా నాన్న నవ్వుతూ నా భుజం తట్టాడు.

***

లోపలికి వెళ్ళాక మా అమ్మ అన్నం వడ్డిస్తూ 'మీ నాన్నమ్మ దగ్గిర విన్న సంగతీ అయినా, ఏం తెలియనట్లు తొందరపెడుతూ' అమ్మాయి అంటున్నావు, అమ్మేగా అని అడిగావూ...! ఇంకోమాటా మర్చిపోయావురా... నేను పార్వతీశం గారింటికి వెళ్ళమని ఎందుకు చెప్పావనుకున్నావ్... ఎప్పుడైనా ఏ కారణం వలనైనా మా ఇంట్లో వీలుకాకపోతే మా నాన్న తన దగ్గిర స్నేహితుడైన పార్వతీశంగారింటికి పంపించటం జరిగేది! మరి ఆయనకూ అలా ఎండనబడి భోజనాలవేళ ఊరికి వెళ్ళిపోతున్న వాళ్ళకి భోజనం పెట్టటం ఇష్టమట! ఒకోసారి మా నాన్నే వెంటబెట్టుకుని రానవసరం లేకుండా మా నాన్న సంగతి తెలుసుకుని, కొందరు వాళ్ళంతట వాళ్ళే మా ఇంటికి వచ్చి తృప్తిగా తిని...మా నాన్నకి ఆనందం కలిగించేవాళ్ళు..!' మీ నాన్న వాళ్ళని చూసి అలా వచ్చిన బాపతే అనుకున్నాను మరి!' నవ్వుమొహంతో అంది.

'అమ్మో... అమ్మా... నువ్వు దొంగవే! మా దగ్గిర లేకుండానే మేం చెప్పుకున్న మాటలన్నీ చాటున ఉండి శ్రద్ధగా విన్నావన్నమాట...! నాకు నాన్నమ్మద్వారా కొంచెంగా తెలిసిన కథే అయినా నాన్న సరదాగా చెబుతున్నాడని వింటూ... నాన్నకి హుషారు కలిగించటానికి ఆత్రుత నటిస్తూ అలా అడిగానంతే...!' అంటూ పెద్దగా నవ్వాను.

నా పక్కనే కూర్చుని అన్నం తింటున్న నాన్నమ్మ చిన్నగా నవ్వింది!

ఒక క్షణం చెప్పటం ఆపి... ఆయన మంచినీళ్ళు తాగి, మళ్ళీ కొనసాగించారు.

అమ్మాయ్... ఎప్పుడు... ఏ సంవత్సరం... లాంటి వివరాలు నాకేం గుర్తుండవు. అందుకని ముందూ వెనకగా చెబుతున్నా. నువ్వే అర్థం చేసుకోవాలి! వయసు పెరుగుతోంది... ఆ పైన ఎప్పటివో ఈ సంగతులన్నీ...! జరిగిన సంఘటనలలో గుర్తున్నవి మాత్రం చెబుతా. కొన్ని బాగా గుర్తున్నా... మా బంధువులు, స్నేహితులు, ఊరి గొడవలు... లాంటివన్నీ అనవసరం కదాని చెప్పటం లేదు. లేకపోతే... ఆ వివరాలకే చాలా సమయం పట్టేస్తుంది మరి!' అంటూ గొంతు సవరించుకుని మళ్ళీ కథ ప్రారంభించారు.

"ఈ సందర్భంలో... మా అమ్మ తెలివీ, తెగువా గురించి నాన్న ఒకసారి చెప్పిన సంఘటన చెబుతాను."

మా తాతకి నాన్నే కాకుండా ఇంకో కొడుకూ ఉన్నాడట! రెండో కొడుకును ఊళ్ళోనే డబ్బున్న బంధువులాయనకు దత్తత ఇవ్వటం జరిగింది. రాతకోతలేం లేవు. మాటతోనే పెంపకానికి ఇచ్చారన్న మాట!

కొన్నాళ్ళ తర్వాత... దత్తత తీసుకున్న వాళ్ళొచ్చి 'అబ్బాయికేం ఆస్తి ఇవ్వరా అనడిగితే తాతయ్య కన్నకొడుకు మీదున్న మమకారంతో తనకున్న నాలుగెకరాల్లో రెండెకరాలు రాసిచ్చాడు. తరువాత... నాన్నమ్మకి పుట్టింటి వాళ్ళు ఇచ్చిన మా ఊళ్ళోని స్థలంలో చిన్న ఇల్లు కట్టి, మా దూరపు బంధువునే ఉంచి వాళ్ళ ఆదరవు కోసం రెండు గేదెల్నీ కొనిచ్చాడట! తర్వాత కొంచెం పెద్దయ్యాక మానాన్నకే ఆ ఇంటినీ, గేదెల్నీ అప్పగించి అప్పుడప్పుడూ వచ్చి

చూసిపోతుండేవాడట. తర్వాత కొన్నాళ్ళకే తాతయ్య చనిపోతే, నాన్నమ్మ మా దగ్గరకు రావటం జరిగింది. తాతయ్య మరణంతో నాన్నమ్మ మా దగ్గరకు వచ్చి ఈ ఊళ్ళోనే ఉండిపోయింది.

తర్వాత... ఒకరోజు ఉన్నట్టుండి దత్తత పోయిన బాబాయ్ ఆ పల్లెలోని తన బంధువులు కొందర్ని వెంటబెట్టుకుని వచ్చాడు.

ఎప్పటినుండో మేం ఉంటున్న స్థలంలో సగం, పాడి పశువుల్లో సగం తనకి చెందాలని అడుగుతోంటే... అదేం కుదరదని మునుపు నాన్నావాళ్ళు చెప్పటంతో ఇప్పుడు మళ్ళీ తేల్చుకుందామని పెద్దమనుష్యుల్ని వెంటబెట్టుకుని వచ్చాడన్నమాట!

ఉన్నట్టుండి అలా పెద్దమనుష్యులతో వస్తాడని ఊహించని మా నాన్న కొంచెంగా బెదిరి, పాలుపోక, తికమకపడుతోంటే... అప్పుడు... అమ్మ రంగ ప్రవేశం చేసిందట!

పూర్తిగా కావాలని అడగటం లేదుగా, సగం ఆస్తి మాత్రమే అడుగుతున్నాడు కాబట్టి న్యాయంగా ఇవ్వాల్సిందే అని వెంట వచ్చిన  పెద్ద మనుష్యులూ గట్టిగా చెప్పారట. అతనికి నలుగురు పిల్లలున్నారు. దత్తత అంటూ పేరుకేగానీ రాతకోతలూ లేవు. సగం వాటా ఇవ్వకపోతే కోర్టుకు వెళ్ళి అయినా సాధిస్తాడని మరోమారు అమ్మకీ హెచ్చరిక చేశారు.

అమ్మ వాళ్ళ బెదిరింపులకు భయపడలేదట! వాళ్ళ ముందుకు వచ్చి ధీమాగా నిలబడి 'సరే.. అలాగే కానివ్వండి... కోర్టులోనే తేల్చుకుందాం... ఇక వెళ్ళండి...' అని చెప్పేసింది. తర్వాత ఒక క్షణం మౌనంగా నిలబడి... మళ్ళీ గొంతు విప్పింది.

'కోర్టుకు వెళ్ళేముందు... ఒక మాట అడిగి చూడటం మంచిదని వచ్చామన్నారుకదా, అలాగే నావీ రెండు మాటలు విని వెళ్ళండి. బాగా తెలియవుగానీ, పెద్దవాళ్ళ ద్వారా విన్నవి కొన్ని రూల్సు, నాకూ తెలుసు. మొదటగా మీరు తెలుసుకోవాల్సిందేమిటంటే... ఈ స్థలం మా అత్తగారికి వాళ్ళ పుట్టింటివాళ్ళు ఇచ్చినది. అది ఇప్పటికీ ఆమె పేరు మీదుగానే ఉంది. అది ఆమె ఎవరికి ఇచ్చుకున్నా ఆమె ఇష్టమే. ఇప్పటికే మా అత్తగారు ఎన్నోసార్లు అనుకోవటం నేను విన్నాను. పెంపకానికి వెళ్ళిన వాడికి వాళ్ళ తరుపునుండీ కొద్దో గొప్పో వచ్చింది. పెద్దాడికి మాత్రం ఆ రెండెకరాలే మిగిలిందీ... అని! ఆమె ఇస్తానంటే... సగం ఈ భూమీ తీసుకోండి... మాకేం అభ్యంతరాలు లేవు.

ఇక పశువుల సంగతి అంటారా... అవి పిత్రార్జితంగా వచ్చినవి కావు కనుక పంచి ఇమ్మని అడిగే హక్కు ఎవరికీ లేదు! మా మావగారు కొన్న వాటిని మా ఆయన తన కష్టంతోనే ఇంత మందని చేశారు! మావగారు తోడ్పాటు వల్లే చేయగలిగారన్నదీ నిజమే! అయితే ఇంకోమాట కూడా చెప్పాలనిపిస్తోంది. ఎక్కడైనా ఆస్తిపాస్తులు పంచుకోవటం జరుగుతుందిగానీ అన్నదమ్ములు పిల్లల్నీ పంచుకోరుగా....! కానీ మీరడగటం మాత్రం అలాగే ఉంది!

వాటిని పశువులని అందరూ అంటారు గానీ, మా ఆయన మాత్రం అవన్నీ తన పిల్లలే అన్నట్లుగా పేర్లు పెట్టటమే కాదు, అంత ప్రేమగానూ చూసుకుంటాడు. ఏదైనా సరిగా

తిండి తినకపోయినా, కొంచెం నలతగా ఉందేమోననిపించినా ఆలశ్యం చేయకుండా ఉరుకులు పరుగులమీద వెళ్ళి డాక్టరును తీసుకువచ్చేస్తాడు. ఇంట్లో కొంచెం చెత్త ఉన్నా పట్టించుకోరుగానీ, పవువుల చావిట్లో మాత్రం కొంచమైనా ఉండటానికీ వీల్లేదు... అంత పరిశుభ్రంగా ఉంచుతారు!

వాటిని మేం పిల్లల్లానే చూసుకుంటాం పెంచుతున్నాం. అవి పాలిస్తూ మమ్మల్ని పెంచుతూ మా పెరుగుదలకి కారణంగా నిలిచాయి. ఎంత ముసలివి అయనా, వట్టిపోయినా వాటి పోషణలో మాత్రం మార్పు ఉండదు. సహజ మరణం రావాల్సిందే తప్ప ఏ ఒక్కటీ కూడా ఇప్పటివరకూ కబేళాకి వెళ్ళటం జరగలేదు!

వాటికీ, మాకు మధ్య ఉన్నది తల్లీ పిల్లల బంధమే! వాటిని సగం ఇమ్మనటం అంటే... మా పిల్లల్లో సగం మందిని అడగటమే కాదూ...?

మా మరిదికి పిల్లలెక్కువ కాబట్టి ఆ విషయమూ ఆలోచించాలని పెద్దలు అన్నారు. మాకు ఒక్కడే అబ్బాయని అనుకుంటున్నారేమో గానీ చాలామంది ఉన్నారని ఇప్పుడు మీకు అర్థమయ్యే ఉంటుంది!

పెంపకంతో మాకేం ఇబ్బంది లేదు. ఎంతైనా కష్టపడగలం! మా మరిదికి మాత్రం కష్టంగా అనిపిస్తే..ఓ ఇద్దర్ని మా ఇంటికి పంపించమనండి, ఆనందంగా పెంచి పెద్ద చేస్తాం...!

ఇంకోమాట... మీరంతా వచ్చారని బెదిరిపోయి చెప్పటంలేదు. మరిదిపట్ల ఉన్న అభిమానంతోనే చెబుతున్నాను. ఊళ్ళో వున్న మా రెండెకరాల్నీ తనే సాగుచేసుకోవచ్చు. కౌలుడబ్బు అవసరం లేదు. మావాడు పెరిగి పెద్దయ్యాక మాత్రం అప్పగించాల్సిందే... అది పిత్రార్జితంగా వచ్చిన వాడి హక్కు. అలా రాతకోతలు రాసుకుందామంటే చెప్పండి... అలాగే చేద్దాం.'

అమ్మ మాటలు ముగించగానే బాబాయ్‌తో వచ్చిన పెద్దమనుష్యులంతా లేచి నిలబడి అప్పటికే అమ్మ అక్కడ పెట్టి ఉంచిన గ్లాసుల్లోని మజ్జిగ తాగి, 'ఈ విషయాలన్నీ తెలియక తొందరపడి వచ్చామనిపిస్తోంది...' అంటూ వెళ్ళిపోయారట!

వాళ్ళందరూ వెళ్ళిపోయాక, బాబాయ్ కూడా లేచి నిలబడి 'అందరూ వెళ్ళి అడిగి చూడు... అంటే విని రావటం తప్పని తెలుసుకున్నాను. క్షమించండి...' అంటూ అమ్మకి చేతులు జోడిరచి నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడట! మా అమ్మ సమర్థత గురించి నాన్న చెప్పాడిదంతా...!

అప్పుడు అక్కడే ఉన్న మా అమ్మ 'ఇందులో నా గొప్ప ఏం ఉందీ, మీ నాన్న చెప్పటానికి భయపడుతూంటే, ఆ మాటల్ని నేనే చెప్పాను. అంతేకదా! ఇందులో ఏదైనా గొప్పతనం అంటూ ఉంటే మాత్రం... అది మీ బాబాయ్‌దే...రా! నిజం! తప్పు ఒప్పుకోవటం, ఆపైన భేషజం లేకుండా క్షమాపణ కోరటమన్నది... చాలా గొప్ప లక్షణం! చాలామంది తప్పనిపించినా

ఒప్పుకోలేక... ఏదో చెబుతూ సమర్థించుకునే ప్రయత్నమే చేస్తారు...!' అంది.

అవునన్నట్లుగా తల ఊపాడు మానాన్న.

***